


# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల

నిర్మల్ - కొమరం భీం

ఆసిఫాబాద్

ఆదివారం /18 మే / 2025 /పేజీలు 05


## అవసరాలకు అనుగుణంగా

# ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలోని లక్షెట్టిపేటలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల–జూనియర్ కళాశాల లలో మౌళిక సదుపాయాలు సమకూర్చేందుకు అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్సాగర్రావుతో కలిసి జిల్లా ఇంటర్మీడియట్, విద్యాశాఖల అధికారులు, సంబంధిత ప్రిన్సిపాళ్ళతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాల లలో విద్యార్థులకు అవసరైమన మేరకు సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నూతన భవన నిర్మాణం చేపట్టి ఫర్నీచర్, ల్యాబ్ పరికరాలు, భోధన సామాగ్రి ఇతర అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పాత భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలో 126 మంది, జూనియర్ కళాశాలలో 320 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు చిత్తశుద్ధితో పని చేయాలని, విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఫర్నీచర్ సంబంధిత సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాన్ని

# పెంపొందించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్రము బోధించే ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ పుస్తక పఠన సామర్థ్యాన్ని విద్యార్థులలో పెంపొందించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. పాఠ్యాంశాల బోధనపై ప్రణాళిక రూపొందించుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని అన్నారు. విద్యార్థులు విద్యపై ఆసక్తి చూపించే విధంగా కృత్రిమ మేధస్సును ఉపయోగించాలని, ప్రతి విద్యార్థి కంప్యూటర్ పై అవగాహన కలిగి ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తరగతిలో 45 నిమిషాల పిరియడ్ లో విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికా ప్రకారం నైపుణ్యతను అందించాలని, పాఠశాలకు గైరహాజరు అయ్యే విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తరగతి గదిలో ఉన్న విద్యార్థులు అభ్యాసన పై ఆసక్తి పెరిగేలా విద్య బోధన చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, శిక్షణ సమన్వయకర్త ఉప్పులేటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.






## వరద ముప్పును నివారించేందుకు శాశ్వత

# పరిష్కార చర్యలు తీసుకుంటాం

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి,మే17,సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ పట్టణంలోని జిఎన్ఆర్ కాలనీలో వర్షాకాలంలో ఏర్పడే వరద ముప్పును నివారించేందుకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం ఆమె రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్విందా కుమార్, విపత్తు నిర్వహణ



విభాగం డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ లతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో ముఖాముఖీగా మాట్లాడి వరదల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరంగా అధికారులు తెలుసుకున్నారు. గత కొంతకాలంగా ప్రతి ఏటా వర్షాకాలంలో తీవ్రంగా వరదలు సంభవిస్తున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నివాసితులు పేర్కొన్నారు. అధిక వర్షపాతం కారణంగా వరద ముప్పు తలెత్తుతుందని, పరివాహక ప్రాంతాల్లో నిర్మించిన చెక్డ్యామ్ వల్ల నీటి ప్రవాహం వరదనీరు కాలనిలో చేరుతుందని కలెక్టర్ తెలిపారు. చెక్డ్యామ్ ఎత్తు తగ్గించేందుకు అనుమతులు లభించాయని, తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గతంలో సంభవించిన వరదల ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా వాటి తీవ్రతను అధికారులకు వివరించారు. అంతకుముందు జిల్లా పర్యటన కు వచ్చిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కి స్థానిక ఫారెస్ట్ గెస్ట్ హౌస్ లో కలెక్టర్ పూలమొక్క ను అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసిల్దార్ రాజు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కడెం పరివాహక ప్రాంతాల్లో ముంపు

# నివారణకు చర్యలు చేపడతాం

### - కడెం ప్రాజెక్టును పరిశీలించిన ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్విందా కుమార్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**కడెం, 17మే,సూర్య మేజర్ న్యూస్ :** కడెం నది పరివాహక ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అవసరమైన పటిష్ట చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్విందా కుమార్ అన్నారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కడెం ప్రాజెక్టును సందర్శించి, గేట్ల పనితీరు, వరద నియంత్రణ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్ డి ఆర్ ఎఫ్ డిప్యూటీ కమాండర్ దామోదర్ సింగ్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్తో కలిసి ప్రాజెక్టు వద్ద జరిగిన విస్తృత సమీక్షలో ప్రత్యేక కార్యదర్శి పాల్గొన్నారు. గతంలో ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగిన సమయంలో గేట్లు ఎత్తే ప్రక్రియలో లోపాలు తలెత్తిన నేపథ్యంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినట్టు జిల్లా కలెక్టర్ వివరించారు. దీనిపై స్పందించిన అర్విందా కుమార్, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కడెం, దస్తురాబాద్ మండలాల్లో వరద ముప్పుకు గురయ్యే 10 నుంచి 12 గ్రామాల్లో మెరుగైన అలారం వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్షాలు అధికంగా కురిసినప్పుడు వరద నీటిని సమర్ధవంతంగా నియంత్రించేందుకు నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు నిర్వహణ తీరును పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఎస్ ఈ రవీందర్, ఈఈ విట్టల్, తహసిల్దార్లు ప్రభాకర్, సర్వరాజ్, ఎం పి డి ఓ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్,మే17,సూర్య మేజర్ న్యూస్**

ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మూలస్తంభాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పట్టణంలోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం నుంచి ప్రారంభమైన ఐదు రోజులపాటు ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారగలరన్నారు. బోధనా నైపుణ్యాలు మెరుగుపడితే పఠన, లెక్కింపు, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యాలు విద్యార్థుల్లో పెరుగుతాయన్నారు. పాఠశాల దశ నుండే విద్యార్థుల్లో లక్ష్య నిర్ధారణ అలవాటు చేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన బోధన పద్ధతులను అవలంబించాలన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని సూచించారు. ఐదు రోజుల శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పి. రామారావు, విద్యాశాఖ అధికారులు వి. నర్సయ్య, లింబాద్రి, జిల్లా ఉపాధ్యాయ శిక్షణ నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.



## అతూకం వేసిన ధాన్యాన్ని

# కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే




2 లో

సూర్య www.suryaa.com
ఆదివారం 18 మే 2025

# తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**రెబ్బెన, మే 17, సూర్య మేజర్ న్యూస్:**

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి తూకం వేసిన దాన్ని కేటాయించిన ప్రకారం రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లుల యజమానులు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని తక్షణమే దిగుమతి చేసుకొని వాహనాన్ని తిరిగి పంపించాలని తెలిపారు. అకాల వర్షాలు వస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచి ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చూడాలని, తాలు, దుమ్ము లేకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం మండల తహసిల్దార్ రామ్మోహన్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారి వినోద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలను

# మోసం చేసిన రేవంత్ సర్కార్

**- అందాల పోటీల పేరుతో కోట్లాది రూపాయలు వృధా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం - ఎలక్షన్ల ముందు ఇస్తానన్న కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఏది - ఇంటింటికి మహిలలకు 2500 రూపాయల పెన్షన్లు మంజూరు చేయాలి - ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్**

**బెల్లంపల్లి, మే 17, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి ఎంసీపీఐయు పార్టీ కార్యాలయంలో శనివారం రోజున ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి, ఎం సిపిఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం



గద్దేనెక్కి 18 నెలలు గడిచినా కూడా ఎలక్షన్ల ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా అందాలపోటీల పేరుతో కోట్లాది రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం వృధా చేస్తుందని తెలంగాణ రాష్ట్రంలోని ఆడబిడ్డలకు అన్యాయం చేస్తుందని, కళ్యాణ లక్ష్మి కింద ఒక లక్ష 16 రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని ఇంతవరకు కూడా ఇవ్వకపోవడం చాలా సిగ్గుచేటని, అందాల పోటీల పేరిట 3270 తులాల బంగారాన్ని పక్క దేశంలో ఉంటున్న ఆడపడుచులకు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా మహిళలకు ఇంటికి 2500 పెన్షన్ ఇస్తానని రేవంత్ సర్కార్ మాట తప్పిందని వాపోయారు. అదేవిధంగా చదువుకుంటున్న ప్రతి యువ మహిళకు స్కూటీ ఇస్తానని కూడా మాట తప్పారని ఎలక్షన్ల ముందు ఏవైతే హామీలు ఇచ్చారో హామీలు అమలు చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి ఆరెపల్లి సతీష్, తోగరి రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి తహసీల్దార్ గా కృష్ణలాల్ బాధ్యతలు

**బెల్లంపల్లి, మే 17, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి మండల నూతన తహసిల్దార్ గా కృష్ణలాల్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జ్యోత్స్న తాండూరుకు బదిలీ పై వెళ్లారు. కాగా కృష్ణ లాల్ బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవో గా నిన్నటి వరకు పని చేయగా తహసిల్దార్గా పదోన్నతి పొందారు. దీంతో ఉద్యోగులు తాసిల్దార్ కృష్ణలాల్ కు బొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.



### రైతులను అ(హ)రిగోస పెడుతున్న

# కాంగ్రెస్ సర్కార్

**- బిజెపి పార్టీ మండల అధ్యక్షులు సారా రమేష్ గౌడ్**



**తిర్యాణి, సూర్య మేజర్ న్యూస్**

ఆరుగలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు హరిగోస పడుతున్నారని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు సార రమేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం ఐకెపి సెంటర్ల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేపట్టడం బాగానే ఉంది కానీ, గతంలో పిఏసిఎస్ ల ద్వారా కొనుగోలు చేసినప్పుడు ధాన్యాన్ని కళ్ళం వద్దకే వచ్చి కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఐ కెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేస్తూ రైతులను పండించిన ధాన్యాన్ని ఐకెపి సెంటర్ల వద్దకే తీసుకురావాలని అనడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దానికి తోడు వర్షాలు రావడంతో పండించిన దాన్యం నీటిపాలై రైతు శ్రమ వృధా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల వద్దకే వెళ్లి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. లేనియెడల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ముగిసిన సమ్మర్ క్యాంపు

**నస్పూర్, మే 17, సూర్య మేజర్ న్యూస్:**

నస్పూర్ పట్టణములోని కేజీబీవీ పాఠశాలలో సమ్మర్ క్యాంపు, ముగింపు కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ యశోదర, స్పెషల్ ఆఫీసర్ మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ సమ్మర్ క్యాంపులో 18 కేజీబీవీ స్కూళ్ల నుండి, 170 విద్యార్థులు పాల్గొని అనేక నైపుణ్యాలతో ప్రగతి సాధించారని అన్నారు. పుస్తక పఠన మాత్రమే చదువు కాదని, ఒక్కొక్క విద్యార్థిలో, ఒక్కొక్క నైపుణ్యం, ఉంటుంది అని. ఆ నైపుణ్యాలను గుర్తించి వారికి తగిన రీతిగా శిక్షణ ఇవ్వడం జరిగింది అని అన్నారు. 15 రోజుల పాటు జరిగిన ఈ క్యాంపులో విద్యార్థులు అన్ని అంశాలలో శిక్షణ తీసుకున్నారని, విద్యార్థులు అందరూ ఆనందంగా ఆటపాటలతో నేర్చుకున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంకరి, స్వర్ణలత, దివ్య, హేమలత,తిరుమల, రజిత, భవాని, రోజా, శారద, కవిత, రోహిణి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, మే 17 సూర్య మేజర్ న్యూస్ :**



ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్నరని సై బర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రజలందరికీ అవగాహన అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని తెలిపారు. ప్రస్తుతం వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వారం రోజుల వ్యవధిలో 15 ఫిర్యాదులు అందాయని ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని ఉదాహరణను తెలిపారు.

# అర్హులకు అందని ఇందిరమ్మ ఇళ్లు

**- ఎమ్మెల్యే స్పందించి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి**



**కడెం, సూర్య మేజర్ న్యూస్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పేదల స్వప్నాలను నిజం చేసే లక్ష్యంతో ప్రారంభించింది. ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని పేదలు, ఈ పథకం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ కొంతమంది కారణంగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదు. అధికారుల తప్పిదంతో ఆన్లైన్ వచ్చిన ఎల్-1,ఎల్-2, ఎల్-3ల కారణంగా అర్హులైన వారు ఇళ్లను కోల్పోతున్నారు. కడెం మండలం లింగాపూర్ గ్రామ పంచాయతీలో గోడలపై అతికించిన ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాపై పలు ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. పంచాయతీ అధికారులు, ఇందిరమ్మ కమిటీ వారు ఒక్కటై కొంతమంది అర్హులను కాదని అనర్హులను ఎంపిక చేయడంతో అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకులు, స్పందించి అర్హులను గుర్తించి సరియైన న్యాయం చేయాలని కోరుతున్నారు. అర్హులకు ఇళ్ళు అందకపోతే అర్హులు అందరూ కలిసి రోడ్డుపై రాస్తారోకో చేయడంతో పాటు, కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుంది అని అంటున్నారు. అక్కడ కూడా న్యాయం జరగక పోతే మినిస్టర్, ముఖ్యమంత్రి వరకు ఈ విషయాలను సోషల్ మీడియా ద్వారా తెలియజేసేలా చేస్తాం అంటున్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన అందని న్యాయం

నా పేరు ఊరే సౌందర్య, మాది కడెం మండలం లింగాపూర్ గ్రామం. మా భర్త పేరు ఊరే రాజేశ్వర్. మాకు అత్త , మామ, కుటుంబ సభ్యులు ఎవరు లేరు. ఇల్లు, ఆస్తిపాస్తులు ఏమి లేవు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న, కానీ కొందరు అధికారులు, నాయకులు కారణంగా మాకు ఇందిరమ్మ ఇళ్ళు అందడం లేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కి తెలిపినపుడు, అనర్హులను గుర్తిస్తున్నాం, మీకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చేస్తా అని అన్నారు. కానీ గ్రామంలో గ్రామ పంచాయతీ లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల లిస్ట్ అతికించారు. మా కంటే పేద వారికి ఇల్లు అందితే సంతోషమే, కానీ మా కన్నా అన్ని వున్న వారికి ఇల్లు ఇచ్చి, మాకు ఇవ్వక పోవడం ఏంటి అనేది మా బాధ. అధికారులు, నాయకులు స్పందించి అర్హులైన వారికి ఇల్లు వచ్చేల చూడాలని కోరుతున్నాము.



## సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలి

**రెబ్బెన, మే 17, సూర్య మేజర్ న్యూస్:**
సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని బెల్లంపల్లి ఏరియా ఇంచార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ అన్నారు. శనివారం రెబ్బెన మండలం గోలేటి లోని సింగరేణి డిస్పెన్సరిలో నిర్వహించిన ప్రపంచ రక్త పోటు దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. ఉద్యోగులు సమతుల పోషకాహారం తీసుకుంటూ ధ్యానం, వ్యాయామం చేయాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. డిప్యూటీ సూపరిండేంట్ ఎం.మురళీమోహన్ రక్త పోటును అదుపులో ఉంచుకోనేందుకు తీసుకోవాల్సిన ఆహార నియమాలను వివరించారు. రక్తపోటు లక్షణాలు తీవ్రంగా ఉంటే జరిగే పరిణామాలను తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఎం రామనాధం, డీజీఎం (సివిల్) ఎస్.కె మదీనా బాషా, మెడికల్ సూపరిండేంట్ స్టాలిన్ బాబు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డివైపిఎం వేణు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

### - బెల్లంపల్లి దళిత సంఘాల ఐక్యవేదిక డిమాండ్.

**బెల్లంపల్లి, మే 17, సూర్య మేజర్ న్యూస్:**
బెల్లంపల్లి దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రోజున బెల్లంపల్లి అంబెడ్కర్ విగ్రహం ముందు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, దళిత సంఘాల అధ్యక్షులు కుంభాల రాజేష్, చిలుక రాజనర్సు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అమలు పరచాలంటూ జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మరియు రాహుల్ గాంధీ,సోనియా గాంధీ



ఒకవైపు భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవాలంటూ అన్ని రాష్ట్రాల వ్యాప్తంగా ప్రచారం చేస్తుండగా మన తెలంగాణ రాష్ట్రంలో దౌర్భాగ్యము ఇంకా మనువాద మత్తులో కొనసాగుతున్నది. మంత్రి వర్గం,75 సంవత్సరాల స్వాతంత్ర దేశంలో మనువాదాన్ని కొనసాగిస్తున్నటువంటి మంత్రి శ్రీధర్ బాబు మంత్రి పదవిలో కొనసాగే అర్హతను కోల్పోయారని ప్రజల చేత ఎన్నుకోబడినటువంటి పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ ను అవమాన పరుస్తూ ప్రోటోకాల్ ను పాటించకుండా అవమానించినారు. యావత్ దళిత జాతిని అవమాన పరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని,ప్రోటోకాల్‌ను పాటించకుండా అవమానపరిచిన శ్రీధర్ బాబును మంత్రి పదవి నుండి తొలగించాలని అలాగే అతని పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బెల్లంపల్లి దళిత సంఘాల ఐక్యవేదిక తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షులు కుంభాల రాజేష్, చిలుక రాజనర్సు, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం గోపాల్, ప్రధాన కార్యదర్శి రత్నం ఐలయ్య, అధికార ప్రతినిధి ఆకునూరి రాజ కుమార్, ఉపాధ్యక్షులు కుష్ణపల్లి రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

## రెండు మొబైల్ ఫోన్లను సిఐఆర్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అప్పగించిన వాంకిడి పోలీస్

**వాంకిడి మే 17సూర్య మేజర్ న్యూస్ :** మండలంలోని ఖమన గ్రామానికి చెందిన శ్రీకాంత్. లక్ష్మీ నగర్ కు చెందిన ఎస్.కె రుక్సానా అనే ఇద్దరూ ఇటీవల వారి సెల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. శనివారం బాధితులకు ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో ఫోన్లను అప్పగించారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు నమోదు చేసుకుంటే ఫోన్లు రికవరీ చేసే అవకాశం ఉంటుందని ఎస్సై అన్నారు. మొబైల్స్ ను ట్రేస్ చేయడంతో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయిమ్ ను అభినందించారు.



# ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను శాంతియుతంగా, నిష్పక్షికంగా నిర్వహించాలి

### -స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**నిర్మల్,17మే,సూర్య మేజర్ న్యూస్ :**
ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను శాంతియుతంగా, నిష్పక్షికంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాల్లో సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పరీక్షలకు మొత్తం 4,927 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో ఫస్ట్ ఇయర్‌కు 3,346, సెకండ్ ఇయర్‌కు 1,581 మంది విద్యార్థులున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో విజిలెన్స్ టీములను నియమించి, చీటింగ్‌కి అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ అవరోధాలు తలెత్తకుండా పోలీసు శాఖ తగిన ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరేలా రవాణా శాఖ సహకరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డీఓ రత్నాకళ్యాణి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, సంక్షేమ, పోలీసు, రవాణా శాఖ అధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### వసతి గృహాలలో ఖాళీగా ఉన్న అడ్మిషన్ల కొరకు

# దరఖాస్తుల స్వీకరణ

### - జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం

**మంచిర్యాల,మే17,సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలోని వెనుకబడిన తరగతుల ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలలో ఖాళీగా ఉన్న అడ్మిషన్ల కొరకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ మెట్రిక్లో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు జిల్లాలోని మంచిర్యాల, లక్సెట్టిపేట, జన్నారం, దండేపల్లి, జైపూర్, మందమర్రి, చెన్నూర్ లలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహాలలో బి.సి. (227), ఎస్.సి. (63), ఎస్.టి. (23), ఇతరులు (40) మొత్తం 353 మందికి అడ్మిషన్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పోస్ట్ మెట్రిక్ (కళాశాల వసతిగృహాలు)లో జిల్లాలోని మంచిర్యాల, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూర్, మందమర్రి లలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల వసతి గృహాలలో బి.సి. (244), ఎస్.సి. (117), ఎస్.టి. (31), ఇతరులు (41) మొత్తం 433 మందికి అడ్మిషన్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్లైన్లో www.bchostels.cgg.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### ఆంజనేయ స్వామి ఆలయంలో

## శ్రీరామ సహిత హనుమత్ యజ్ఞం

**నస్పూర్, మే 17, సూర్య మేజర్ న్యూస్:**
నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో, శనివారం శ్రీరామ సహిత హనుమత్ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో, హనుమాన్ దీక్ష పరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో, వేద పండితుల మంత్రోచ్చారణలతో యజ్ఞం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ మోతిలాల్, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు, రఘునాథ్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలోఆలయ కమిటీ సభ్యులు, స్వాములు , కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ఎంపికకు దరఖాస్తుల స్వీకరణ

### - జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి

**మంచిర్యాల,మే17,సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం గల ప్రైవేట్ పాఠశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ఎంపిక కొరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన పాఠశాలలలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు 5వ తరగతి విద్యార్థులు 42 వేలు ఉపకార వేతనం, ఉచిత భోజన, వసతితో పాటు 2 జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ట్యూషన్ ఫీజు నిమిత్తం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 1వ తరగతి (డే స్కాలర్)లో ఎంపికైన విద్యార్థులకు 28 వేల రూపాయలు ఉపకార వేతనం, ట్యూషన్తో పాటు ఉచిత 2 జతల " దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల నిమిత్తం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములను ఈ నెల 21వ తేదీ లోగా జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు పాఠశాల అనుమతి ధృవీకరణ పత్రం, పాఠశాలలో సదుపాయాలు, భవనం ప్లాన్, అగ్నిమాపక భద్రత, గత 5 సం.ఎల ఉత్తీర్ణత శాతం, పాఠశాలలో నిర్వహించబడుతున్న కోర్సులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలు సమర్పించాలని, అన్ని ప్రాథమిక సౌకర్యాలతో తగినంత మంచి నివాస వసతి ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల ప్రైవేట్ పాఠశాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అంతర్జాతీయ అందాల పోటీలను సందర్శించే అవకాశం లభించడంపై ఆనందం వ్యక్తపరచిన బెల్లంపల్లి విద్యార్థి

**బెల్లంపల్లి, మే 17, సూర్య మేజర్ న్యూస్:**
తెలంగాణ ప్రభుత్వ పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మే 10 నుండి 31 వరకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ అందాల పోటీలో, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా క్రీడలను వీక్షించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా, షేక్‌పేట్ సీఓఈ లో చదువుతున్న బెల్లంపల్లి పట్టణానికి చెందిన ప్రథమ్ పాండే మే 10న క్రీడలను వీక్షించాడు. తిరిగి అవకాశం లభించడంతో శనివారం క్రీడలను వీక్షించాడు. ఈ సందర్భంగా ప్రథమ్ పాండే అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు అర్జున్ అవార్డు గ్రహీత తేజస్ పడిగను కలిసి తమ అనుభవాలను వ్యక్త పరిచాడు. అంతర్జాతీయ క్రీడలను సందర్శించే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, టీజీ ఎస్ డబ్ల్యు ఆర్ ఇ ఐ ఎస్ కార్యదర్శి అలుగు వర్షిణికి, ప్రిన్సిపాల్ బాలస్వామికి, కళాశాల ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను

# వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,మే17,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మండలాల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో పైలట్ గ్రామాలను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, అర్హుల జాబితా, రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన వారిని ఎంపిక, త్రాగునీటి సరఫరా, నమూనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం, ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెంపుదల అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పైలెట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అర్హులైన




లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇంటిని 400 చదరపు గజముల నుండి 600 చదరపు గజముల లో మాత్రమే నిర్మించాలని, అటవీ శాఖ అధికారులను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుందని తెలిపారు. మిగతా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారుల జాబితా అందించాలని, జాబితాలో అనర్హుల పేర్లు ఉండకూడదని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కిద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి జాబితా రూపొందించి జిల్లా స్థాయి కమిటీకి సమర్పించాలని తెలిపారు. అర్హులైన వారికి జూన్ 2వ తేదీన మంజూరు పత్రాలు అందించడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని, సమస్యాత్మక ప్రాంతాలలో నీటి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, చేతి పంపులు, పైపు లైన్, మోటార్ మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, నిధులను సద్వినియోగపరచాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే అభివృద్ధి పనులలో కూలీల సంఖ్య పెంచాలని,



అందరికీ ఉపాధి కల్పించాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రత దృష్ట్యా పని ప్రదేశాలలో నీడ, త్రాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఉపాధి హామీ కూలీల ఖాతాలలో ఉపాధి డబ్బులు జమ వివరాలను పరిశీలించాలని తెలిపారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, ఎండ నుండి కాపాడుకోవాలని, ప్రతిరోజు సకాలంలో నీటిని అందించాలని తెలిపారు. కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు సమీక్షించాలని, త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పనులలో భాగంగా నీరు ఇంకే విధంగా సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులలో ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, హౌసింగ్ పి. డి. వేణుగోపాల్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఆధ్యాత్మికతతో మానసిక సాంత్వన

### - జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**మంచిర్యాల,మే 17, సూర్య మేజర్ న్యూస్ :**

ఆధ్యాత్మికతతో మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో



నిర్వహించిన హనాయ మహా యజ్ఞ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతకు ప్రత్యేకత ఉందని, ఆధ్యాత్మిక వాతావరణంలో మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం కేటాయించుకోవాలని, మానసిక ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. నిర్వాహకులు, వేద పండితులు మహా యజ్ఞాన్ని తలపెట్టడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహణ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

### వరి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

**జైపూర్, మే 17 సూర్య మేజర్ న్యూస్**

వరి ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించాలని ప్రాజెక్టు డైరెక్టర్ కిషన్ అన్నారు. శనివారం జైపూర్ మండలంలోని గంగిపల్లి శెట్ పల్లి,బెజ్జలా,గ్రామాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం రాజ్ కుమార్ తో కలిసి సందర్శించారు.మైచర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని హమాలీలు అందుబాటులో లేకపోతే వేరే ప్రాంతాల నుండి తీసుకురావాలని అన్నారు.భారీ వర్షాలు రాబోతున్నావని రైతుల నష్టపోకుండా ఉండాలంటే వెంటనే ధాన్యాన్ని కాంట వేసి మిల్లులకు పంపించాలని తెలిపారు.



---

## కమనీయంగా హనుమాన్ శోభాయాత్ర

**జైపూర్ ,మే 17 సూర్య మేజర్ న్యూస్**

జైపూర్ మండలం కుందారం గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ వాహనంలో భారీ హనుమాన్ చిత్రపటాన్ని పెట్టి ,గ్రామంలోని వీధుల్లో ఊరేగిస్తూ హనుమాన్ స్వాములు ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామంలోని చిన్న పిల్లలు ఈ ర్యాలీలో హనుమాన్ జెండాలతో సందడి




చేశారు. హనుమాన్ నామస్మరణతో స్థానిక గ్రామంతా మారు మ్రోగినది. ఈ క్రమంలో గ్రామ ప్రజలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గురుస్వామి రవి గౌడ్ మాట్లాడుతూ ఆంజనేయస్వామి కలియుగ దైవం అని చెప్పారు.ధర్మం కోసం హిందూసమాజం ఏకం కావాలని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్క హిందువు బాధ్యతని తెలిపారు.

## నల్ల బ్యాడ్జీలతో సెక్యూరిటీ గార్డ్స్ ల నిరసన

**జైపూర్: మే 17 సూర్య మేజర్ న్యూస్**

నల్ల బ్యాడ్జీలు ధరించి సెక్యూరిటీ గార్డ్స్ శనివారం నిరసన వ్యక్తం చేశారు.జైపూర్ మండలంలోని సింగరేణి విద్యుత్ థర్మల్ పవర్ ప్లాంట్ లో కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డ్ గా పని చేస్తున్న పలువురు ఎస్ టి పిపి ముందు వారి ఆవేదన తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 7న చెల్లించాల్సిన వేతనాలు నెలలుగా గడుపుతున్నారని కుటుంబ పోషణ ఎలా కొనసాగించడం అని కాంట్రాక్టర్ పై మండిపడ్డారు.ప్రతినెల సరియైన సమయానికి వేతనాలు చెల్లించాలని అన్నారు. లేనియెడల కాంట్రాక్టర్ పై యజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డ్స్ పాల్గొన్నారు.



---

### దళిత ఎంపీ వంశీకృష్ణను అవమానపరిచిన

# మంత్రిపై చర్యలు తీసుకోవాలి

**జైపూర్, మే 17 సూర్య మేజర్ న్యూస్**

దళిత ఎంపీని అవమాన పరిచిన మంత్రి శ్రీధర్ బాబు పై అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జైపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియా



కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.కాలేశ్వరం సరస్వతి పుష్కరాల ఫ్లెక్సీ ల్లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫోటో లేక పోవడం దళిత ఎంపీ అని అవమాన పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు నియోజకవర్గ మాల సంఘం అధ్యక్షులు శీల వెంకటేశం,మాజీ సర్పంచ్ పండుగ రాజన్న,సోషల్ మీడియా చెన్నూరు నియోజకవర్గ ఇన్చార్జ్ సృజన్ మండల ఇంచార్జి అరుణ్ నాయకులు సుమన్,శ్రావణ్,తదితరులు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో బావిలో పడి యువకుడు మృతి

**సారంగాపూర్,ఏప్రిల్ 18,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని గోపాల్ పేట్ గ్రామానికి చెందిన బరుకుంట రవి (30) అనే యువకుడు బావిలో పడి మృతి చెందినట్లు సారంగాపూర్ మండల ఎస్సై సట్ల శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బరుకుంట రవి సమీప బంధువులు మండలంలోని చించోలి (బి) శివారు షేక్ సాహెబ్ దర్గా దగ్గర శు క్రవారం రోజు పండగ చేయడంతో అక్కడికి వెళ్లడని తిరిగి ఇంటికి రాకపోవడంతో దర్గా చుట్టు వెతకగా సమీపంలోని బావిలో శవమై కనిపించినట్లు తెలిపారు. తాగిన మైకంలో బావిలోకి దిగగా మునిగి చనిపోయి ఉండవచ్చని అన్నారు. మృతుడి భార్య బరుకుంట లలితా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సారంగాపూర్ ఎస్సై సట్ల శ్రీకాంత్ తెలిపారు.



## కారుణ్య నియామకం కోసం ఇంటర్వ్యూలు

**రెబ్బెన, మే 17, సూర్య మేజర్ న్యూస్:** సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్వ్యాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు గోలేటి లోని జిఎం కార్యాలయం కాన్ఫరెన్సు హాల్ లో శనివారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెడికల్ ఇన్వాలిడేట్ అయిన




ఐదుగురు ఉద్యోగులు వారసుల కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు, కుటుంబ సభ్యులను ఎస్ ఓ టు జిఎం కె రాజమల్లు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి లు ప్రశ్నించి ధ్రువ పత్రాలను పరిశీలించారు. సింగరేణి సంస్థ ద్వారా అందే బెనిఫిట్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా , బీపీఎ ఓసి మేనేజర్ మహేష్, డి వై పీఎం వేణు, ఖైరిగుర సంక్షేమ అధికారి రజినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంతక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, మే 17, సూర్య మేజర్ న్యూస్:** మండలంలోని పటుపటి తండా గ్రామానికి చెందిన ఆడే రవీందర్ మృతి చెందారు. ఆడే రవీందర్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోదరుడైన ధనరాజ్ సడ్డకుడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆడే రవీందర్ అంతక్రియలో పాల్గొన్నారు. ఈ అంత క్రియ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, జాదవ్ గణేష్, మాజీ పి ఎస్ ఎస్ చైర్మన్ పాల్గొన్నారు.



## ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత

**రెబ్బెన, మే 17, సూర్య మేజర్ న్యూస్:** సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని బెల్లంపల్లి ఏరియా ఇంచార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ అన్నారు. శనివారం రెబ్బెన మండలం గోలేటి లోని సింగరేణి డిస్పెంసరిలో నిర్వహించిన ప్రపంచ రక్త పోటు దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..ఉద్యోగులు సమతుల పోషకాహారం తీసుకుంటూ ధ్యానం, వ్యాయామం చేయాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. డిప్యూటి సూపరిండేంట్ డా మురళీమోహన్ రక్త పోటును అదుపులో ఉంచుకోనేందుకు తీసుకోవాల్సిన ఆహార నియమాలను వివరించారు. రక్తపోటు లక్షణాలు తీవ్రంగా ఉంటే జరిగే పరిణామాలను తెలిపారు ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఎం రామనాథం , డీజీఎం(సివిల్) మదీనా బాషా, మెడికల్ సూపరిండేంట్ స్టాలిన్ బాబు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డివైపిఎం వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఖేలో ఇండియా సీనియర్ నేషనల్ గేమ్స్ లో గోలేటి క్రీడాకారినీలు

**రెబ్బెన, మే 17, సూర్య మేజర్ న్యూస్:** మే 19 నుండి 24 వరకు జరిగే ఖేలో ఇండియా నేషనల్ గేమ్స్ లో బాగంగా గుజరాత్ రాష్టం దయ్యు ధమాన్ లో నిర్వహించే సెపక్ తక్రా (బీచ్ లెగ్ వాలీబాల్) పోటీలకు కొమురంభీమ్ జిల్లా రెబ్బెనమండలం గోలేటి గ్రామానికి చెందిన కుమ్మరి స్ఫూర్తి కారుణ్య తోట అనూష ఎంపిక అయినట్లు తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఖేలో ఇండియా గేమ్స్ క్రీడా నైపుణ్యం గల యువ క్రీడాకారులను వెలికి తియ్యడం తోపాటు ఒలింపిక్ గేమ్స్ సిద్ధం చెయ్యడం ఎంతో గర్వకారణం గతంలో కారుణ్య 2025 వరంగల్ నందు నిర్వహించిన సీనియర్ నేషనల్ పోటీల్లో మరియు అనూష 2022 లో రాజస్థాన్ నిర్వహించిన జూనియర్ జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్నట్లు గా తెలిపారు. ఎంపిక అయినా క్రీడాకారినులను ఉమ్మడి ఆదిలాబాద్ ఒలింపిక్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ నారాయణ రెడ్డి తెలంగాణ బాల్ బాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి ఎస్ తిరుపతి తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా సంయుక్త కార్యదర్శి శిరీష తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ భాస్కర్ రామకృష్ణ మల్లేష్





షార్ప్ స్టార్ బాల్ బాడ్మింటన్ అధ్యక్షులు మహేందర్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

### భారతీయ జనతా పార్టీ సోన్ మండల

## నూతన కార్యవర్గం ఎన్నిక

### - మండల అధ్యక్షుడిగా మార గంగారెడ్డి

**సోన్, మే 17 సూర్య మేజర్ న్యూస్:** నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ ఆధ్వర్యంలో బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం సోన్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోన్ మండల అధ్యక్షులుగా మార గంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా పెసరి గణేష్, బోనగిరి గంగయ్య, మద్దెల గంగాధర్ , ఎలుగు విజయ, ప్రధాన కార్యదర్శులుగా సుంచు సవీన్, మామిడాల సంతోష్, కార్యదర్శులుగా మేకల మల్లేష్, జక్క ప్రశాంత్, బద్ధం గంగారెడ్డి,అటాక్ శైలజ, కోశాధికారి గా కొటూరి లావణ్య, అలాగే 45 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగఎన్నుకున్నారు.



## హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

**రామకృష్ణాపూర్, మే 17, సూర్య మేజర్ న్యూస్:**

అభయ అంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకొని రామకృష్ణాపూర్ లోగల స్థానిక విజయగణపతి దేవాలయంలో హనుమాన్ ఆలయంలో పూజారి సతీష్ శర్మ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని యజ్ఞశాలలో నిర్వహించిన మహా యజ్ఞంలో హనుమాన్ మాలాధారులు పాల్గొన్నారు. పట్టణంలోని భక్తులు ఆయురారోగ్యాలతో సుఖ జీవనం సాగించాలని, స్వామివారి ఆశీస్సులు భక్తులకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని చేశారు.



## ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి

### - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్ మే 17, సూర్య మేజర్ న్యూస్:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాల్లో సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. ఫస్ట్



ఇయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పరీక్షలకు మొత్తం 4,927 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో ఫస్ట్ ఇయర్‌కు 3,346, సెకండ్ ఇయర్‌కు 1,581 మంది విద్యార్థులున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో విజిలెన్స్ టీములను నియమించి, చీటింగ్‌కి అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ అవరోధాలు తలెత్తకుండా పోలీసు శాఖ తగిన ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరేలా రవాణా శాఖ సహకరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డీఓ రత్నాకళ్యాణి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, సంక్షేమ, పోలీసు, రవాణా శాఖ అధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నిద్రిస్తున్న వారిపై దూసుకెళ్లిన ఐస్క్రీమ్ వాహనం



**నిర్మల్ సూర్య మేజర్ వే.17 న్యూస్:** నిర్మల్ జిల్లా మామడ మండలం కొరటికల్లో ఇంటి ముందు నిద్రిస్తున్న ఇద్దరిపై నుంచి ఐస్క్రీమ్ వాహనం దూసుకెళ్లింది. లక్ష్మణచందా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఐస్క్రీమ్ వాహనం కోరిటికల్ వద్ద అదుపుతప్పి ఓ ఇంటి ముందు నిద్రిస్తున్న వారిపై దూసుకెళ్లింది. దీంతో వారికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలిచారు.

## మద్యం మత్తులో బావిలో పడి యువకుడు మృతి

**సారంగాపూర్,ఏప్రిల్ 18,సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని గోపాల్ పేట్ గ్రామానికి చెందిన బరుకుంట రవి (30) అనే యువకుడు బావిలో పడి మృతి చెందినట్లు సారంగాపూర్ మండల ఎస్సై సట్ల శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బరుకుంట రవి సమీప బంధువులు మండలంలోని చించోలి (బి) శివారు షేక్ సాహెబ్ దర్గా దగ్గర శుక్రవారం రోజు పండగ చేయడంతో అక్కడికి వెళ్లడని తిరిగి ఇంటికి రాకపోవడంతో దర్గా చుట్టు వెతకగా సమీపంలోని బావిలో శవమై కనిపించినట్లు తెలిపారు. తాగిన మైకంలో బావిలోకి దిగగా మునిగి చనిపోయి ఉండవచ్చని అన్నారు. మృతుడి భార్య బరుకుంట లలితా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సారంగాపూర్ ఎస్సై సట్ల శ్రీకాంత్ తెలిపారు.